

- 6లో



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు

జిల్లా వార్తలు


ఆదివారం 6 ఏప్రిల్ 2025



తిరుపతి...తిరువళ్లూరు రోడ్డు

విస్తరణ పనులు చకచకా...

నగరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నుంచి తిరువళ్లూరు వరకు చేపట్టిన జాతీయ రహదారి వెడల్పు పనులు వేగవంతమయ్యాయి.తమిళనాడులోని తిరువళ్లూరు..తిరుత్తణి మీదుగా నగరి, పుత్తూరు ఓవర్ బ్రిడ్జివరకు నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. తిరుపతి నుంచి తిరువళ్లూరు వరకు రూ.864 కోట్ల వ్యయంతో రోడ్డు వెడల్పు పనులు చేయడానికి జాతీయ రహదారుల విభాగం అంచనా వేసింది.ఐదేళ్ల క్రితం తిరుపతి నుంచి పుత్తూరు వరకు చేపట్టిన ఈ విస్తరణ పనులు అక్కడితో ఆగిపోయాయి.అయితే ఏరియల్ సర్వే పూర్తి చేసి ,భూములు



సేకరించి నష్టపరిహారం చెల్లించే పనులు పూర్తయ్యాయి.ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. పుత్తూరు ఓవర్ బ్రిడ్జి నుంచి తిరువళ్లూరు వరకు గల రోడ్డును గతంలోనే జాతీయ రహదారిగా గుర్తించారు.అయితే ఇరుకుగా వుండి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుండడంతో విస్తరణ పనులు చేపట్టారు.నగరి,పుత్తూరు మధ్య విపరీతంగా జరుగుతున్న ప్రమాదాలు ఈ రోడ్డు విస్తరణ పనులతో తగ్గే అవకాశముంది. ఇప్పటి వరకు టూ లేన్‌గా వున్న రోడ్డు 60 మీటర్ల విస్తీర్ణంతో నాలుగు లేన్ల రోడ్డుగా మారబోతోంది.జాతీయ రహదారి నిబంధనలను అనుసరించి డివైడర్, రోడ్డు పక్కనే వర్షపునీరు ప్రవహించడానికి అనువుగా కాలువలు, సర్వీసురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డు నిర్మాణ స్థలాలు చదును చేయడంతోబాటు కల్వర్టులు, మినీ వంతెనల వద్ద విస్తరణ పనులు, కాలువల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.వీకేఆర్‌పురం వద్ద కీలపట్టు ఆంజనేయస్వామి ఆలయ సర్కిల్, నగరి ఏరియా వైద్యశాల సర్కిల్ వద్ద, కనంమిట్ట వద్ద, వేపగుంట క్రాస్‌ల వద్ద అండర్‌పాస్ రోడ్లు నిర్మించనున్నారు. దేశమ్మ దేవాలయ ఆర్చి సమీపం ఓవర్ బ్రిడ్జి , బైపాస్‌మార్గంలో కుశస్థలీనదిపై మేజర్‌బ్రిడ్జి నిర్మించనున్నారు. ఉయ్యాల కాలువ వద్ద, జీవీఆర్



కళ్యాణమండప సమీపంలో, పరమేశ్వరమంగళం వద్ద మినీ బ్రిడ్జిలు, 60 చోట్ల కల్వర్టులు నిర్మించనున్నారు.ఈ రహదారి పనులు 19 ఆలయాలు, 4మండపాలు, 3శిలావిగ్రహాలు, ఒక ఆలయ ప్రవేశ ఆర్చిపై ప్రభావం చూపనున్నాయి.ఈ పనులు రెండేళ్లలో పూర్తవుతాయని నేషనల్ హైవేస్ పీఆర్వో రాజారావు తెలిపారు. ప్రస్తుతం మినీ బ్రిడ్జిల వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు విస్తరణ ప్రాంతాలను చదును చేయడంతో పాటు కాలువలు నిర్మించే పనులు చేస్తున్నామన్నారు.

బడుల్లో టీవీల చోరీ ముఠా అరెస్టు

యాదమరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో టీవీలను చోరీ చేసే ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. యాదమరిలో ఎస్‌ఐ ఈశ్వర్‌తో కలిసి వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు శనివారం మీడియాకు వివరాలు తెలిపారు. మూడు నెలల వ్యవధిలో యాదమరి మండలంలోని కొటాల జడ్పీ హైస్కూల్, పచ్చాపూర్ ఎంపీపీ స్కూల్, యాదమరి హైస్కూల్‌తోపాటు చిత్తూరు రూరల్ తుమ్మిందపాళెం ఎంపీపీ పాఠశాల్లో 65 ఇంచ్‌ల టీవీలు చోరీకి గురయ్యాయి. ఈ చోరీలపై ఐదు కేసులు నమోదయ్యాయి. దీంతో ఎస్పీ మణికంఠ ఆదేశాలతో వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్‌ఐ ఈశ్వర్ ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం నలుగురు నిందితులను కన్నికాపురం చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసి, ఏడు టీవీలను, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, గుడియాత్తం పరిధిలోని పాఠశాలలోనూ వీరు టీవీ చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితులంతా పాతికేళ్లు దాటనివారే కావడం గమనార్హం. అరెస్టయిన వారిలో.. యాదమరి మండలంలోని తెల్లరాళ్లపల్లె పంచాయతీకి చెందిన చక్రపాణి, దేవేంద్రన్, సంపంగి నెల్లూరుకు చెందిన కార్తీక్, తమిళనాడు రాష్ట్రం పరదరామి తాలుకా బాలిగౌండర్‌పట్టికి చెందిన మురళి ఉన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్‌ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న టీవీలు

చాట్‌బాట్‌లో చిత్తూరు పోలీసుల రికార్డు

- 11 దశల్లో 3,541 ఫోన్ల రికవరీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : చాట్‌బాట్‌లో చిత్తూరు జిల్లా పోలీసులు రికార్డు సృష్టించారని ఎస్పీ మణికంఠ చెప్పారు.11 దశల్లో రూ. 7.42 కోట్ల విలువ చేసే 3,541 ఫోన్లను రికవరీ చేసినట్లు వివరించిన ఆయన ఆ ఫోన్లను పోగొట్టుకున్న వారికి చిత్తూరు పోలీసు అతిథి గృహంలో శనివారం అందించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 11విడతల్లో సుమారు రూ.91.20 లక్షల విలువ చేసే 456 మొబైల్ ఫోన్లను చాట్‌బాట్ ద్వారా రికవరీ చేశామన్నారు.ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహరాష్ట్ర ప్రాంతాల నుంచి ఫోన్లను రికవరీ చేశామన్నారు.ఎవరైనా మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే పోలీసు స్టేషన్లకు వెళ్లకుండా, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా చాట్‌బాట్ ద్వారా సేవలు పొందవచ్చన్నారు. ఇందుకోసం 9440900004 వాట్సాప్‌కు హాయ్ లేదా హెల్ప్ అని మెసేజ్ పంపాలన్నారు. ఇలా చేస్తే వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీసు పేరున లింకు వస్తుందన్నారు. ఆ లింకులో గూగుల్ ఫార్మాట్ ఓపెన్ అవుతుందన్నారు. అందులో వివరాలు పూరించాలని ఎస్పీ సూచించారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ అయిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌బీ సీఐ బాస్కర్, చాట్‌బాట్ సిబ్బంది బాహూజీ,శ్రీనివాసన్,రఘురామన్ తదితరులు పాల్గొన్నారు.



పలు మండలాల్లో వర్షం

అత్యధికంగా బంగారుపాళ్యంలో 40.8 మిమీ



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది.గడిచిన 24 గంటల్లో వర్షపాతాన్ని పరిశీలిస్తే అత్యధికంగా బంగారుపాళ్యంలో 40.8 మి.మీ, యాదమరిలో 40.2మి.మీ వర్షపాతం నమోదయ్యింది.పుంగనూరులో 37.2మి.మీ, తవణంపల్లెలో 31.2, పలమనేరులో 24.4, కుప్పంలో 20.2, పూతలపట్టులో 19.2, సదుంలో 18.2, చిత్తూరులో 15.2, బైరెడ్డిపల్లెలో 14.2, శాంతిపురంలో 12.2, పులిచెర్లలో 11.6, గంగాధరనెల్లూరులో 10.4, వి.కోటలో 10, గంగవరంలో 9.2, చౌడేపల్లెలో 8, గుడిపాలలో 4.8, ఐరాలలో 4.2, పెనుమూరులో 3, పెద్దపంజాణిలో 2.8, గుడుపల్లెలో 2.4, రామకుప్పంలో 2.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. ఏప్రిల్ నెల సాధారణ వర్షపాతం 2.2 మిమీ నమోదు కావాల్సివుండగా, శుక్ర, శనివారాల్లో సరాసరి 12.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది.



జగ్జీవన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద తదితరులు

దళిత కాలనీల్లో వందశాతం

మౌలిక సదుపాయాలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అప్పుడే సమాజం బాగుపడుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం జగ్జీవన్ రామ్ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు గంగినేని పార్కు వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అక్కడినుంచి దళిత సంఘాల డప్పువాయిద్యాల నడుమ ర్యాలీగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. దళిత కాలనీల్లో వందశాతం మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగులంతా పనిచేస్తామన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, దళిత సంఘాల నేతలు మునస్వామి, రాజ్‌కుమార్, కమిషనర్ నరసింహ ప్రసాద్, ధనశేఖర్, శంకర్,రవి, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

కాలినడకన కలెక్టర్

జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం నడిచారు. గంగినేని చెరువు పార్కు వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ నుంచి అధికారులు, ప్రజా ప్రతినిదులు, దళిత సంఘాల నేతలతో కలసి ఆయన ఎంఎస్‌ఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్, ఓవర్ బ్రిడ్జి నుంచి కలెక్టర్ బంగ్లా మీదుగా అంబేడ్కర్ భవన్‌కు కాలినడకన చేరుకున్నారు. కలెక్టర్ తమతోపాటు నడవడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల నేతలు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఏ కలెక్టర్ ఇలా చేయలేదని దళిత సంఘాల నేతలు చెప్పారు.

పోలీసుల అదుపులో బంగారం దోపిడీ ముఠా

- రెండు రోజుల్లో దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు కేజీఎఫ్ కాంగ్రెస్ నేతగా గుర్తింపు
- డ్రైవర్ వద్ద తీగలాగితే.. దోపిడీ డొంక కదిలింది

వి.కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో కారును అడ్డగించి బంగారాన్ని దోచుకెళ్లిన కేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో డీఎస్పీ డి. ప్రభాకర్ నేతృత్వంలో నాలుగు పోలీసు బృందాలు చాకచక్యంగా అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాను అదుపులోకి తీసుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన వ్యాపారి వద్ద పనిచేస్తున్న వాహన డ్రైవర్ వద్ద తీగలాగితే దోపిడీ డొంక మొత్తం కదిలినట్లు సమాచారం.కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ముఠా సభ్యులు సినీఫక్కీలో వ్యూహరచన చేసి పక్కా ప్రణాళికతో కారు ప్రయాణించే మార్గంలో నిర్మానుష్య ప్రాంతాన్ని దోపిడీకి అనువుగా ఉంటుందని ఎంచుకున్నారు. బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తమిళనాడు రాష్ట్ర సరిహద్దులు దాటాక బంగారు కడ్డీలను తరలిస్తున్న కారును గుర్తించి మరో కారులో వెంబడించారు.నాయకనేరి అటవీ ప్రాంతంలో కత్తులు చూపించి కారును ఆపారు. కారు వెనుక సీట్లో కూర్చొన్న వ్యక్తిని కత్తులతో బెదిరించి బంగారం దాచివుంచిన కారు డిక్కీ తాళాలను తీసుకుని, అందులోని బంగారాన్ని తస్కరించి కారులో పరారయ్యారు. ఘటన జరిగింది అటవీ ప్రాంతం కావడంతో తీవ్ర భయాందోళనకు లోనైన బాధితులు జరిగిన దోపిడీని యజమానికి వివరించి, ఆయన సూచన మేరకు వి.కోట పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీఐ సోమశేఖర్ ఎస్పీకి సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసి నాలుగు బృందాలతో దర్యాప్తు మొదలెట్టారు. బంగారం తరలిస్తున్న కారును గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి సెల్ ఫోన్ డేటా ఆధారంగా అసలు నిందితులను గుర్తించినట్లు సమాచారం. పాత నేరస్తులు జట్టుగా ఏర్పడి సులువుగా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు.కేజీఎఫ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖుడి నేతృత్వంలో ఈ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. అతడితో పాటు ఇతర నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి వద్ద దోపిడీ చేసిన బంగారంలో 3.5కిలోలను రికవరీ చేసి 8మందిని అరెస్టు చేసినట్లు సమాచారం.మరో పావు కిలో బంగారాన్ని రికవరీ చేయడంతో పాటు మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.కేజీఎఫ్ అధికార పార్టీ నేతను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో అతడిని విడిపించేందుకు అక్కడి అధికార పార్టీ పెద్దలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.



వి.కోట స్టేషన్ వద్ద సీఐతో మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరా..? అయితే ఎక్కొద్దు

- ఆర్టీసీ కండక్టర్‌పై ఆర్ఎంకు ఫిర్యాదు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన ఓ యువకుడు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వారాంతపు సెలవు కావడంతో చిత్తూరుకు రావడానికి శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు వేలూరు ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నాడు. అక్కడ ఆర్టీసీ బస్సు (సప్తగిరి ఎక్స్‌ప్రెస్) ఉంటే ఎక్కేందుకు వెళ్లాడు. కండక్టర్ ఎక్కడికి వెళ్లాలని అడిగాడు.. చిత్తూరుకు అని చెప్పగా.. ఎక్కొద్దు అన్నాడు. సీటు అవసరం లేదని, నిల్చొని అయినా వస్తానని చెప్పినా వినలేదు. ఇద్దరి మధ్యా వాగ్వాదం జరిగింది. ఇది చూసి కండక్టర్‌కు డ్రైవర్ తోడయ్యాడు. 'ఎవరికైనా చెప్పుకో.. మమ్మల్ని ఏమీ చేయలేరు' అని ఆ యువకుడిపై దురుసుగా ప్రవర్తించారు. చివరకు ఆ యువకుడిని బస్సు ఎక్కించుకోకుండానే వెళ్లిపోయారు. రెండు గంటల పాటు ఆ యువకుడు వేచి ఉండి ప్రైవేటు బస్సులో చిత్తూరుకు వచ్చాడు. శనివారం ఉదయం ఆర్ఎం జగదీష్‌ను కలిసి జరిగిన విషయంపై ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని తిరుపతి డీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆర్ఎం తెలిపారు.

కాణిపాకంలో నేడు సీతారాముల కల్యాణం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య అభిజిత్ లగ్నంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ ఉభయదారులు, జిల్లాలోని స్వామి భక్తులు విచ్చేయాలని కోరారు.



సీజేఐ దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న ఈవో శ్యామలరావు

అమ్మవారి సేవలో సీజేఐ

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా శనివారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆలయ మర్యాదలతో జస్టిస్‌కు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు పలువురు న్యాయమూర్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సీజే రాక సందర్భంగా ఆలయం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

'కల్కి2'కి ఇంకా టైం ఉంది నాగ్ అశ్విన్

రెబల్ స్టార్ ప్రభాస్ 'కల్కి-2'పై దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. తిరుమల శ్రీవారిని శనివారం సుప్రభాతసేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కల్కి సెకండ్ పార్టు ఎప్పుడు రాబోతోందని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఇంకా టైం పడుతుందన్నారు. కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోడం సంతోషంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,327


తలనీలాలు సమర్పించినవారు: 26,354



సప్తగిరుల్లోనూ మార్మోగే శ్రీరామనామం

అన్ని అర్చనలు, సేవల్లోనూ ఆయనకు స్థానం

నేడు శ్రీరామనవమి ఆస్థానానికి ఘనంగా ఏర్పాట్లు



కౌసల్యా సుప్రజా రామా...

యుగపురుషుడు శ్రీరామచంద్రమూర్తి త్రేతాయుగానికే పరిమితం కాదు. కాలమేదైనా ధర్మానికీ, జనరంజక పాలనకూ ఆయనే ఆదర్శం. కలియుగ వెంకన్న కొలువైన తిరుమలలోనూ ఈ జగదభిరాముడి ప్రస్తావన వినిపిస్తూనే ఉంటుంది. కనిపిస్తూనే ఉంటుంది. శ్రీవారిని మేలుకొలుపే 'కౌసల్యా సుప్రజారామా, పూర్వా సంధ్యా ప్రవర్తతే...' అంటూ ఈ జగదానందకారకుడి నామ స్మరణతోనే లోకాన్ని మేల్కొలుపుతారు. తిరుమల క్షేత్రంలో కొలువుదీరి ఉన్న శ్రీరాముడి విగ్రహం వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగింది. తిరుమల శ్రీనివాసుడితో పాటు పూజలందుకుంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అదిగదిగో రాములవారి మేడ

తిరుమల బంగారువాకిలి నుంచి వేంకటేశ్వరుడి గర్భాలయంలోకి వెళ్లే మార్గంలో స్నపనమండపం దాటగానే 'రాములవారిమేడ' దర్శనమిస్తుంది. అక్కడ రాములవారి పరివారమైన అంగద, హనుమంత, సుగ్రీవుల విగ్రహాలుంటాయి. ప్రస్తుతం గర్భాలయంలో శ్రీనివాసుడి మూలమూర్తితో పాటు సీతారామలక్ష్మణుల విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. ఈ విగ్రహాలు పూర్వం రాములవారిమేడలో ఉండేవని చెబుతారు. అందువల్లే రాములవారి మేడగా పిలుచుకుంటున్నారు.

తెప్పోత్సవాల్లో తొలిరోజు విహారం

ఏటా ఐదు రోజుల పాటు జరిగే వార్షిక తెప్పోత్సవాల్లో తొలిరోజు తెప్పపై కొలువుదీరేది శ్రీరామచంద్రుడే. పుష్కరిణిలో తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా నీలమేఘశ్యాముడు దివ్యతేజస్సుతో విహరిస్తూ భక్తకోటికి దర్శనమిస్తారు. వసంతోత్సవాల్లో తొలి రెండు రోజులు మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించే అర్చకులు చివరిరోజు కృష్ణస్వామిని, రాములవారిని ఒకే వేదికపై కొలువుదీర్చుతారు. వారికీ స్నపనం నిర్వహిస్తారు. ఒకే వేదికపై కనిపించే ఈ ఇద్దరు యుగపురుషులను చూడటానికి భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు.


బ్రహ్మోత్సవాల్లో కోదండరాముడిగా దర్శనం

ఏటా బ్రహ్మోత్సవాల్లోనూ ఆరో రోజు హనుమంత వాహనంపై శ్రీవారే కోదండరాముడిగా మాడవీధుల్లో విహరించి దర్శనమిస్తారు. త్రేతా యుగంలో తనకు సేవ చేసిన భక్త శిఖామణి హనుమంతుడిని వాహనంగా చేసుకుని తిరువీధుల్లో ఊరేగుతారని చెబుతారు. హనుమంతుడి భక్తి తత్పరతను ఈకాలం నాటి వారికి చాటిచెబుతూ రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు అన్నీ తానేనని తెలియజేస్తారు. రథసప్తమి నాడూ హనుమంత వాహనంపై దర్శనమిస్తారు.

జన్మ నక్షత్రం నాడు ఊరేగింపు

ఆయా మాసాల్లో వచ్చే ప్రత్యేక నక్షత్రాలకు తగినట్టు మలయప్పస్వామి దర్శనమిస్తుంటారు. శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు రోజున శ్రీవారి ఆలయంలో ఆస్థానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సీతారామలక్ష్మణస్వామిని పీఠంలో అధిరోహింపజేసి విశేష అభరణలు, పూలమాలలతో అలంకరించి సహస్ర దీపాలంకార సేవను నిర్వహిస్తారు. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయస్వామి సమేతంగా తిరుమాడవీధుల్లో ఊరేగుతారు.

తిరుమల వీధుల్లో ఊరేగుతున్న శ్రీరామచంద్రమూర్తి (ఫైల్‌ఫొటో)



ప్రియ సేవకుడు కొలువుదీరిందిక్కడే

రాముడి విశ్వాసపాత్రుడైన సేవకుడు ఆంజనేయ స్వామి కొలువైంది కూడా ఏడుకొండల్లోని అంజనాద్రే. తల్లి అంజనాదేవితో కలిసి బాలాంజనేయస్వామి నేటికీ ఆకాశగంగ తీర్థం వద్ద భక్తులకు దర్శనమిస్తున్నారు. అంజనాద్రే ఆంజనేయుడి జన్మస్థలమని ఇటీవల కొన్ని పండిత బృందాలు కూడా శాస్త్రపరంగా నిరూపించాయి. విశిష్టత కలిగిన జపాలి క్షేత్రం కూడా అంజనాద్రిపైనే వెలసింది. జపాలి మహర్షి కోరిక మేరకు ఆంజనేయస్వామికి స్వయంభువుగా వెలసినట్టుగా చారిత్రక ఆధారాలున్నాయి. స్కందపురాణం, వేంకటాచల మహత్యంలోనూ ఈ క్షేత్రం గురించి ప్రస్తావించారు. రావణ సంహారం తర్వాత సీతా సమేతంగా ఆయోధ్యకు వెళ్లే ముందు శ్రీరాముడు జపాలి తీర్థంలో కొంతకాలం విడిది చేసినట్టు మరో ఐతిహ్యం ప్రాచుర్యంలో ఉంది.

నేడు శ్రీరామనవమి ఆస్థానం

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయక మండపంలో సీతాలక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంతవాహన సేవ జరుగనుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. మరుసటి రోజు రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవంగా చేపట్టనున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

రెండు కార్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి జీవకోనలో కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితులను శనివారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ శ్రీలత మీడియాకు తెలిపిన వివరాలివి.... తిరుపతి జీవకోనలో ఉంటున్న కసారం రాజేష్ మీ-సేవ నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ భార్గవ్ ఇతనికి స్నేహితుడు. రాజేష్‌కు అతని తల్లి విజయ పేరుతో విలువైన పొలాలు, ఆస్తులున్నాయని భార్గవ్ తెలుసుకున్నాడు. దీంతో రాజేష్‌ను, కుటుంబసభ్యులను బెదిరించి రూ.2 కోట్లు లాక్కోవాలని పథకం పన్నాడు. బీ-టెక్ చదివి అప్పటికే నేరాలతో సంబంధమున్న వట్టికుంట అరుణ్‌కుమార్‌తో చేతులు కలిపాడు. పన్నాగంలో భాగంగా గతనెల 28న రాజేష్‌కు ఫోన్ చేశారు. బీమా పాలసీ చేయించడానికి తల్లిని తీసుకురావాలని నమ్మపలికారు. దీంతో రాజేష్ తన తల్లిని తీసుకుని భార్గవ్ ఉంటున్న ఫ్లాట్‌కు వచ్చాడు. అరుణ్, భార్గవ్‌లు వెంటనే వారిద్దరినీ గదిలో బంధించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఉన్న రూ1.5 కోట్లు డ్రా చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు స్పందించకపోవడంతో రాజేష్ భార్య సుమతి, ఇద్దరు చిన్న పిల్లలను కూడా తీసుకొచ్చారు. అయినా చలించకపోవడంతో మరుసటి రోజు (29న) తెల్లవారుజామున సుమతి, ఆమె అత్తను, ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి కారులో బెంగళూరుకు వెళ్లారు. మరో వాహనంలో రాజేష్‌ను కిడ్నాప్ చేసి చిత్తూరు వైపు బయలుదేరారు. అయితే ఐతేపల్లి వద్ద రాజేష్ చాకచక్యంగా వాహనం బ్రేక్ వేసి డోర్ తీసి కారు నుంచి బయట పడ్డాడు. దీంతో అరుణ్‌కుమార్ ఆగ్రహంతో రాడ్‌తో రాజేష్‌పై దాడి చేసి అదే వాహనంలో వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన రాజేష్ వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు జరిగిన విషయం తెలియజేశాడు. స్థానికులు అతడ్ని తిరుపతి రుయాలో చేర్పించాడు. తమ ప్లాన్ బెడిసికొట్టిందని తెలుసుకున్న నిందితులు రాజేష్ తల్లి విజయను చిత్తూరులో వదలిపెట్టారు. సుమతిని బెంగళూరులోని ఆమె పుట్టింటి సమీపాన విడిచివెళ్లారు. పిల్లలను కూడా వదిలేశారు. అలిపిరి పోలీసులు కిడ్నాప్ కేసును సీరియస్‌గా పరిగణించారు. గాలింపు ముమ్మరం చేశారు. రేణిగుంట-కడప రోడ్డులో కుక్కల దొడ్డి వద్ద ప్రధాన నిందితులు అరుణ్‌కుమార్, భార్గవ్‌లతో పాటు పలు కేసులతో సంబంధమున్న సాయికుమార్, మణికంఠ, ప్రకాష్, గణేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, నాలుగు కత్తులు, మత్తు పదార్థాలు, ఐరన్ రాడ్‌తో పాటు వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ రాంకిషోర్, ఎస్‌ఐలు లోకేష్‌బాబు, నాగార్జున రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

నిందితులు పాతనేరస్థులే..

కిడ్నాప్ యత్నం కేసులో నిందితుడు అరుణ్‌కుమార్‌ది గరుడాద్రినగర్. ఇతనే ఈ వ్యవహారమంతా నడిపించాడని పోలీసులు గుర్తించారు. 2015లో స్నేహితుడు దిలీప్‌ను మోసం చేసి హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు. ఇతడిపై నాలుగు క్రిమినల్ కేసులు, ఏటీఎం చోరీ కేసు, కిడ్నాప్ కేసులు, ఇతర ఆర్థిక మోసాల కేసులున్నాయి. రౌడీ షీట్ కూడా ఉంది. మరో నిందితుడు భార్గవ్‌పై హత్య కేసుతో పాటు కిడ్నాప్, బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఇతనిపై తిరుపతి పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు.

జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుల ఎంపిక కమిటీలో పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్



కలికిరి/కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు కానున్న జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులను ఎంపిక చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటితో పాటు రాష్ట్రంలోని మిగతా 13 కొత్త జిల్లా కేంద్రాల్లో జువెనైల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బోర్డులో ఛైర్మన్, సభ్యుల పదవుల కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవాలని కోరుతూ ప్రభుతవం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డుకు అర్హులైన ఛైర్మన్, సభ్యులను ఎంపిక చేయడానికి తాజాగా ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావును నియమించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆ శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. సభ్యులుగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.లలితకుమారి, కడప యోగివేమన వర్శిటీ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, ఏపీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతితో పాటు ఒక యునిసెఫ్ ప్రతినిధి, సౌత్ రీజినల్ రిసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్ ఇండియా ఫౌండేషన్ నుంచి మరో ప్రతినిధినితో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటయింది. మూడేళ్లపాటు ఈ కమిటీ కార్యకలాపాల్లో పాల్గొంటుందని పేర్కొంటూ రాష్ట్ర స్త్రీ, బాలల, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు 1,888 మంది హాజరు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుతిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 1,888 మంది హాజరయ్యారు. తిరుపతిలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, గీతం, శ్లోక ఎ బిర్లా, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం పరీక్ష సమయానికి అర్ధగంట ముందే 1.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మధ్యాహ్నం 12 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 2,125 మంది దరఖాస్తు చేసుకోగా 237 మంది గైర్హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి.కైలాస్‌నాథ్ చెప్పారు.

వైభవంగా మూడో రోజు ఉరుసు మహోత్సవం

- దర్గాను దర్శించుకున్న న్యాయమూర్తులు
- సందడి చేసిన జబర్దస్త్ హైపర్ ఆది బృందం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో హిందు, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. మూడోరోజు హజరత్ అమీర్‌షావలి దర్గాను నాయుడుపేట, సూళ్లూరుపేట న్యాయమూర్తులు అనిల్, అనూష, సంయుక్తలు దర్శించుకున్నారు. చివరిరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాను దర్శించుకున్నారు. రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. జబర్దస్త్ హైపర్ ఆది తన బృందంతో వినోదం పంచారు. కార్యక్రమంలో శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, నెలవల రాజేష్, మధురెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, చెంగయ్య, పసల గంగాప్రసాద్, షైలారి రాజశేఖర్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దర్గాను దర్శించుకుంటున్న హిందూ ముస్లింలు

అందరూ ఇచ్చినా ఆయనొక్కడే!

శ్మశాన దారికి భూమిచ్చేందుకు ససేమిరా అన్నరైతు



కొలతలు తీసి రాళ్లు నాటుతున్న అధికారులు

పుత్తూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపురానికి శ్మశాన దారి సమస్య చాలా రోజులుగా ఉంది. గ్రామానికి, శ్మశానానికి మధ్య దాదాపు రెండు కిలోమీటర్లుండడంతో శవాలను పొలాల మీద తీసుకువెళ్లాల్సి వస్తోంది. పొలాలన్నీ పట్టా భూములే కావడంతో 35 మంది పట్టాదారుల అంగీకారంతో దారి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉచితంగా పట్టా భూములు ఇచ్చేందుకు 34 మంది రైతులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఓ రైతు మాత్రం భూమిని ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి ఈ సమస్య వెళ్లింది. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ సురేంద్రనాయుడు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, వామపక్ష నాయకులు వెంకటేశం, గ్రామస్తులు కలిసి ఆ రైతును ఒప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ రైతు కోల్పోయే ఒకటిన్నర సెంటు భూమికి గ్రామంలో సేకరించిన రూ.మూడు లక్షలను పరిహారంగా ఇస్తామని నచ్చజెప్పారు.అయినా ఆయన స్పందించకపోవడంతో షణ్ముగరెడ్డి చొరవ తీసుకుని పుత్తూరు పట్టణంలో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇప్పిస్తామని చెప్పారు. అయినా సమ్మతించని ఆ రైతు ఓ దశలో అసహనానికి గురై తనపై ఒత్తిడి తెస్తే చీటీ రాసి చచ్చిపోతానని స్పష్టం చేశారు. దీంతో ఏమి మాట్లాడాలో అర్థంగాని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పటికే అంగీకరించిన 34 మంది రైతుల పట్టా భూముల్లో కొలతలు వేసి రాళ్లు నాటి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. పది రోజుల తర్వాత మరోసారి రైతుకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నారు.

జగన్ బొమ్మ ఉన్న పాస్ పుస్తకాలు ఇక చెల్లవు

డక్కిలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బొమ్మతో ముద్రించిన పాస్ పుస్తకాలు ఇకపై చెల్లవని, వాటిని వెనక్కి ఇచ్చేసి కొత్తగా ముద్రించినవి పొందాలని తహసీల్దారు మోపూరు శ్రీనివాసులు రైతులకు సూచించారు. డక్కిలి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలపై గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మను ముద్రించి అందజేశారని, ప్రస్తుతం వాటిని తిరిగి ఇచ్చేసి కొత్తవి తీసుకోవాలని రైతులకు సూచించారు. అంతేకాకుండా నవరత్నాల పేరుతో అమలు చేసిన ప్రభుత్వ పథకాలపై ముద్రించిన జగన్ బొమ్మలన్నిటినీ తొలిగించడం జరిగిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన 30 జీవో ప్రకారం గయాళి, అనాధీన భూములను ఆక్రమించుకుని నిర్మించుకొన్న ఇళ్లను క్రమబద్ధీకరించి హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఎంపీపీ రాజశేఖర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఒక్కో ఎంపీటీసీ సభ్యుడికి మండల గ్రాంటు నుంచి రూ.2 లక్షలు కేయించమన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, ఎంఈవో వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఆడబ్ల్యూఎస్ ఏఈలు చంద్రశేఖర్, నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రేణిగుంట అర్బన్ సీఐకి చార్జి మెమో

- ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌పై విచారణకు ఎస్పీ ఆదేశం

రేణిగుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పారిపోయిన ఘటనలో అర్బన్ సీఐ శరత్‌చంద్రకు ఎస్పీ చార్జి మెమో జారీ చేశారు.అలాగే అర్బన్ ఎస్‌ఐ అరుణ్ కుమార్‌రెడ్డిపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటనపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు సీరియస్ కావడంతో ఇద్దరు ఐడీ పార్టీ కానిస్టేబుళ్లపై ఇదివరకు సస్పెన్షన్ వేటు పడగా ఇదే ఘటనపై స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బాధ్యత వహిస్తూ సీఐకు చార్జి మెమో జారీ చేశారు.ఈ ఘటనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డిపై ఎస్పీ పోలీసులు విచారణ చేసి ఎస్పీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇబ్బందులు తొలగి అభివృద్ధివైపు అడుగులు..

- ఎమ్మెల్సీ సోము వీర్రాజు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దయతో రాష్ట్రంలోని ఇబ్బందులన్నీ తొలిగి అభివృద్ధివైపు అడుగులేస్తున్నామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుచి 2024 వరకు అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రాష్ట్రం రాజధాని, స్టీల్ ప్లాంట్, పోలవరం వంటి అనేక అంశాల్లో ప్రగతిని సాధిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులోనూ నిరంతరం పర్యటన చేస్తున్నారని, వారితో పాటు డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కూడా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడేలా ఆశీర్వదించమని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఇక, శ్రీవారి నిధులను ధర్మానికే కేటాయించాలన్నారు. ఈ సంకల్పంతో భానుప్రకాష్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రసంశించారు.



గ్రూప్-2కు కానిస్టేబుల్ ఆదినారాయణ ఎంపిక



చౌడేపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఆదినారాయణ గ్రూప్-2కు ఎంపికయ్యారు. పెద్దపంజాణి మండలం బందార్లపల్లెకు చెందిన ఆదినారాయణ రైతు కుటుంబంలో జన్మించిన 2004లో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. 2009లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తూ చౌడేపల్లెకు ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐ, గ్రూప్-2 కోసం ఐదుసార్లు పట్టు వదలకుండా ప్రయత్నం చేశారు. చివరిగా 2025 గ్రూప్-2 పరీక్షల ఫలితాలలో ఆయన గ్రూప్-2కు ఎంపికైనట్లు తెలిపారు. ఆయనను పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్‌ఐ నాగేశ్వరరావు, సహచర సిబ్బంది అభినందించారు.

తల్లిదండ్రులు మందలించారని..

● ఇంటినుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

● చెన్నైలో గుర్తించి తీసుకొచ్చిన పోలీసులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి వెళ్లిపోయారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చెన్నైలో పిల్లలను గుర్తించారు. చిత్తూరు నగరంలోని వన్నియర్ బ్లాక్‌లో జయవేలు, మహేశ్వరి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి పిల్లలు పవిత్ర(14), గౌతమ్ కృష్ణ(12)లు డీఐ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆటలాడుతున్నారని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఉన్న రూ. వెయ్యి తీసుకుని శుక్రవారం స్కూల్ వదిలాక చెన్నైకి వెళ్లిపోయారు. విద్యార్థుల తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఫోన్ నెంబర్ల ఆధారంగా చెన్నైలో ఉన్నట్లు గుర్తించారు. ఏఎస్‌ఐ తులసీరామ్, పోలీసులతో కలిసి చెన్నై వెళ్లారు. చెన్నై రాజమంగళం పోలీసు స్టేషన్ సిబ్బంది సాయంతో గుర్తించి వారిద్దరినీ శనివారం చిత్తూరుకు తీసుకొచ్చారు. తల్లిదండ్రులకు సీఐ నెట్టి కంఠయ్య కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించారు.

ఘనంగా పాటూరి జయంతి వేడుకలు



రాజగోపాల నాయుడి విగ్రహం వద్ద ప్రముఖుల నివాళులు

తవణంపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ పాటూరి రాజగోపాల నాయుడు 105వ జయంతి వేడుకలను తవణంపల్లె మండలంలోని దిగువ మాఘం రాజన్న పార్కులో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామ చంద్ర నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌నాయుడు విగ్రహానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, గల్లా దంపతులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే గల్లా అరుణకుమారి మనవడు, సినీ హీరో అశోక్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి.. వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. రాజగోపాల్‌నాయుడు జీవితం ఎందరికో ఆదర్శమని, విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, స్థానిక సర్పంచ్ గోపితోపాటు పలువురు టీడీపీ నాయకులు, దిగువమాఘం గ్రామస్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో సీఐడీ డీజీపీ



రవిశంకర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని శనివారం సీఐడీ డీజీపీ రవిశంకర్ దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిత్తూరు వెస్టు సీఐ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రెడ్డెప్ప మృతదేహం

తవణంపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తవణంపల్లె మండలంలోని జొన్నగురకల పంచాయతీ నీలంపల్లె ఎస్సీవాడకు చెందిన విజయన్ కుమారుడు రెడ్డెప్ప (24) దిగువమాఘం పంచాయతీ అమరపురి సమీపంలోని కోళ్ల షెడ్డుపై కొబ్బరి మట్టలు పరుస్తున్నాడు. ప్రమాదవశాత్తూ కొబ్బరి మట్టపైన ఉన్న విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై షెడ్డు నుంచి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం అరగొండ అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని తవణంపల్లె పోలీసులు తెలిపారు.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

● 8 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు అటవీ రేంజ్‌లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ ఆర్‌ఐ చిరంజీవులకు చెందిన ఆర్‌ఎస్‌ఐ నరేష్ బృందం, పత్తూరు అటవీశాఖ ఎఫ్‌బీవో లింగనాయక్‌తో కలిసి అక్కడ తెలుగు గంగ కెనాల్ నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేస్తూ ముందుకు సాగారు. ఖాజీపేట మండలం ప్రొద్దుటూరు రేంజ్‌లో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిళ్లపై అనుమానాస్పదంగా నిలబడి ఉన్నారు. వారు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి మోటారు సైకిళ్లను వదలి పారిపోయేందుకు యత్నించారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది వారిని వెంటాడి పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు డంప్ చేసిన 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు కడప జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనాన్ని, రెండు ద్విచక్ర వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుంజుకోని టమోటా ధరలు

● మరో అవకాశంపై ఆశతో విస్తారంగా నాట్లు



సోమలలో విస్తారంగా టమోటా నాట్లు

సోమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలతో ఆరు నెలలుగా నష్టాలు చవిచూస్తున్న రైతులు అధైర్యపడకుండా, మళ్లీ ధరలపై ఆశలు పెట్టుకుని విస్తారంగా నాట్లకు శ్రీకారం చుడుతున్నారు. విడతలు విడతలుగా టమోటా నాట్లు వేస్తున్నారు. సోమల మండలంలో ఇప్పటికే 600 ఎకరాలకు మించి దిగుబడులు వస్తున్నాయి. 15కిలోల బాక్సు రూ.120కి మించకపోవడంతో ధరలు గిట్టుబాటు కాక కోత కూలీలు, రవాణా ఖర్చులు రాకపోవడంతో నష్టపోతున్నారు. గత జనవరిలో 15వ తేదీ అనంతరం నాట్లు వేసిన రైతుల తోటల్లో దిగుబడులు వస్తున్నాయి. ఎకరా టమోటా సాగుకు రూ.2లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో టమోటా ధరలు ఆశాజనకంగా 15కిలోల బాక్సు రూ.500కు మించి పలకడంతో ఆదే ఆశలతో రెట్టింపు ఉత్సాహంతో సాగు చేశారు. ప్రస్తుతం ధరలు లేక అల్లాడుతున్నారు. మరి కొందరు మరో విడతలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి టమోటా సాగుకు శ్రీకారం చుడుతున్నారు. సోమల, కరకమంద, కందూరు, పెద్దఉప్పరపల్లె, నంజంపేట, పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె తదితర పంచాయతీల్లో మూడు రోజులుగా 800 ఎకరాల్లో టమోటా నాట్లు వేస్తున్నారు. ధరల పరిస్థితి ఎలా ఉన్నా నాట్లు జోరుగా సాగుతున్నాయి. సోమలలో ఏడాది క్రితం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రారంభించినా పనులు పూర్తి కాకపోవడంతోపాటు వ్యాపారస్తులకు అద్దె గదులు కేటాయించలేదు. దీంతో టమోటా రైతులు అధిక ప్రయాసలతో పుంగనూరు, మదనపల్లె, కోలారు, పలమనేరు మార్కెట్లకు టమోటాలను రవాణా చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సోమల మార్కెట్ యార్డులో టమోటాల కొనుగోలుకు శ్రీకారం చుట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిని వివాదాస్పదం చేయకండి

● బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు



సమావేశంలో ప్రసంగిస్తున్న సోము వీర్రాజు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై వివాదాస్పదం చేయొద్దని.. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా శనివారం చిత్తూరుకు వచ్చిన ఆయన్ను గిరింపేటలోని ఓ ఫంక్షను హాలులో బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సోము వీర్రాజు మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ మృతి విషయంలో ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోందని, ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో కొందరు ఈ అంశాన్ని వివాదాస్పదం చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికి కేంద్ర ఇస్తున్న నిధుల్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రశంసించారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్ర నిధుల్ని పక్కదారి పట్టించడంతోపాటు అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. వక్ఫ్ బిల్లు ఆమోదంతో ముస్లిం మహిళలతోపాటు మైనారిటీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో మామిడి, టమోట పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మార్కెట్ కమిటీలు నిర్ధారించిన ధరలకే పంటలు విక్రయిస్తున్నారని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని చెప్పారు. అదే విధానాన్ని చిత్తూరు జిల్లాలోని మార్కెట్ కమిటీలు అమలు చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నిషితరాజు, నాయకులు బ్రహ్మానందం, రామభద్ర, సిద్ధ, పలు మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీడ్ ఇస్తేనే బాండ్లు

● టీడీఆర్‌లకు గిఫ్ట్ డీడ్‌లు ఇవ్వాల్సిందే

● అప్పుడు అడ్డగోలుగా ఇవ్వడం వలనే ఇప్పుడీ తిప్పలు

● రెండో రోజు మేళాలో 67 మందికి ఆన్‌లైన్

● వీటిలో 48కి గ్రీన్ సిగ్నల్

● నేడు మేళాతోపాటు ఫీల్డ్ విజిట్



రెండో రోజు కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

తిరుపతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): 'డీడ్ ఈజ్ నీడ్..' టీడీఆర్ బాండ్ల కోసం వస్తున్న బాధితులకు అధికారుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్న సమాధానమిది. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధృవీకరణ స్పెషల్ డ్రైవ్ రెండో రోజు శనివారమూ కొనసాగింది. సెలవుదినమైనప్పటికీ పెద్దఎత్తున కార్పొరేషన్ కార్యాలయానికి టీడీఆర్ బాధితులు రావడం కనిపించింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం ఆస్తులు పోయినవాళ్లు నగరపాలక సంస్థకు గిఫ్ట్ డీడ్ ఇచ్చివుండాలని, ఇవ్వనివారు ఇప్పుడైనా ఇస్తే ఆన్‌లైన్ లాగిన్ చేస్తామని చెప్పడంతో తొలుత నిరుత్సాహపడ్డారు. తర్వాత గిఫ్ట్ డీడ్‌లకు అంగీకరించారు. గతంలో గిఫ్ట్ డీడ్‌లు ఇవ్వనివారికూడా టీడీఆర్ బాండ్లు ఇచ్చారని పలువురు అధికారుల ముందు ప్రస్తావించారు. అప్పుడు అడ్డగోలుగా ఇవ్వడం వలనే ఇప్పుటీ తిప్పలు తప్పడం లేదని అధికారులు తలలు పట్టుకున్నారు. రెండో రోజు స్పెషల్ డ్రైవ్‌కు వచ్చిన 67మందికి ఆన్‌లైన్లో లాగిన్ చేశారు. వీటిలో 48 దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టౌన్‌ప్లానింగ్ లాగిన్‌లో వీటిని పొందుపరిచారు. వీటికి త్వరలోనే టీడీఆర్ బాండ్లు జారీచేయనున్నారు. ఆదివారం సెలవు దినం కూడా టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలన కోసం ఒక బృందం కార్యాలయంలో ఉంటే, మరో బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లనుంది. ఈ కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, డీటీసీపీ అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు, డీసీపీ మహాపాత్ర, ఏసిపి లు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పెండింగ్ టీడీఆర్ బాండ్లు	:587
● రెండు రోజుల్లో వచ్చిన దరఖాస్తులు	:115
● శనివారం వచ్చినవి	:67
● టీపీఎస్ లాగిన్‌కి వెళ్లినవి	:48

క్రీడాకారుల సొమ్ము

రూ.119కోట్లు మింగేశారు

● మాజీ మంత్రి రోజాపై శాప్ చైర్మన్ ఆరోపణ

● టీడీఆర్ బాండ్లపై నాటకం వేయాలని వైసీపీకి సూచన



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వీధి నాటకాలు వేసే వైసీపీ నాయకులు టీడీఆర్ బాండ్లపై మున్సిపల్ ఆఫీసులో జరుగుతున్న గ్రీవెన్స్ వద్దకు వచ్చి నాటకం వేయాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు సవాల్ విసిరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరెస్టు చేసే దమ్ము, ధైర్యం ఉందా అని మాజీ మంత్రి రోజా మాట్లాడుతున్నారని, అరెస్టు చేసేందుకు వాళ్లు చేసిన అవినీతి పనులే చాలన్నారు.మంత్రిగా ఉన్న సమయంలో క్రీడాకారులకు చెందాల్సిన సుమారు రూ.119కోట్ల డబ్బును దోచుకు తిన్నారని విమర్శించారు.రోజా అరెస్టు న్యాయబద్ధంగానే త్వరలో జరుగుతుందని, అంతవరకూ ఓపిక పట్టాలన్నారు. నోరుంది కదా అని ఇష్టానుసారం మాట్లాడితే ఎవరూ భయపడబోరన్నారు.చెన్నైలో వుంటోన్న రోజా తమిళనాడు ఛానల్స్ చూస్తారని, బెంగళూరులో వుంటోన్న వారి నాయకుడు కన్నడ ఛానల్స్ చూస్తారని...... ఏపీలో ఛానల్స్‌ను చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి తెలుస్తుందన్నారు.5 సంవత్సరాల్లో వెయ్యి రూపాయలు పించను సొమ్ము పెంచిన వైసీపీ నేతలు కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. తిరుపతిలో ఎన్నడు లేని విధంగా పగటి వేషాలు వేస్తున్న వైసీపీ నేతలు ముందు దాని గురించి పూర్తిగా తెలుసుకుంటే మంచిదన్నారు. అసెంబ్లీ సాక్షిగా వైసీపీ ఎమ్మెల్సీలు అడిగిన విద్యుత్ ఛార్జీల పెంపు ప్రశ్నకు సంబంధిత మంత్రి వివరంగా సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు, కూటమి ప్రభుత్వం 9 నెలల పాలనలో ఎప్పుడు పెంచారో అభినయ్ సమాధానం చెప్పాలన్నారు.తాము రాజకీయ విలువలతో ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తున్నాం కాబట్టి మీరు మాస్కులు పెట్టుకుని వీధి నాటకాలు వేయగలుగుతున్నారన్నారు.శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీ నిధులు విడుదల చేయడంపై మాట్లాడుతున్న వైసీపీ నాయకులు దానికి ,టీటీడీకి ఎలాంటి సంబంధం ఉంది అనే విషయాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, హేమంత్, శ్రీను యాదవ్, వాసు, రంజిత్, రఫీ, లోకేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

హోంస్టే నిర్వాహకుల మధ్య ఘర్షణ

నలుగురికి తీవ్ర గాయాలు ● ఇరువర్గాలపై కేసు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రెండు హోంస్టేల నిర్వాహకుల నడుమ ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. చింతలచేనులో డెక్కన్‌సూట్స్ పేరుతో హోంస్టే నిర్వహిస్తున్న కలికిరి నవీన్‌కుమార్‌రెడ్డి, అతని స్నేహితులు నరేష్‌కుమార్, హోటల్ మేనేజర్ లక్ష్మీనారాయణలు ఆరుబయట నిలుచుని ఉన్నారు. డెక్కన్ సూట్స్‌కు ఎదురుగా గరుడ ఇన్ హోంస్టే ఉంది. దీని నిర్వాహకుడైన పవన్‌కుమార్ తన స్నేహితులు మధుశేఖర్, మరికొంత మంది తమ హోంస్టేకు వచ్చే వారిని ఎందుకు తీసుకెళుతున్నారని డెక్కన్‌సూట్స్ వారితో గొడవకు దిగారు. కత్తులు, రాడ్లు, కర్రలు తీసుకుని దాడులు చేశారు. నవీన్‌కుమార్‌రెడ్డి, నరేష్‌కుమార్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ గాయపడ్డాడు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నవీన్‌కుమార్, నరేష్‌కుమార్‌లను తిరుపతి రుయాకు తరలించారు. పవన్‌కుమార్, మధుశేఖర్‌తో పాటు మరి కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. అదేవిధంగా గరుడ ఇన్ స్టేహోం యజమాని పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు నవీన్, పణీంద్ర నరేష్‌పై కేసు నమోదు చేశారు.

సైన్స్ సెంటర్‌లో సమ్మర్ హాబీ క్యాంప్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మంగళం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో విద్యార్థుల కోసం సమ్మర్ హాబీ క్యాంప్‌ను ఈ నెల 28 నుంచి మే 31 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో 4 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. విద్యార్థులు సంబంధిత లింక్‌ను ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సబ్జెక్టును బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 7989694681ను సంప్రదించాలని కోరారు.

వరసిద్ధుడి వైభవం, ఆలయ విశిష్టతపై త్వరలో పాట రచిస్తా

● ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్



ఆలయంలో సినీ గేయ రచయిత చంద్రబోస్

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి వైభవం, ఆలయ విశిష్టతపై త్వరలో గేయాన్ని రచించి ఆలయానికి అందిస్తానని ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. శనివారం వరసిద్ధుడిని ఆయన దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఔదార్యం

● అపస్మారక స్థితిలోని వృద్ధురాలిని ఆస్పత్రికి తీసుకెళ్లిన వెంకటసుబ్బయ్య



వృద్ధురాలిని తన వాహనంలోకి ఎక్కించుకుంటున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య విధి నిర్వహణలో వెళ్తుండగా అపస్మారస్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని గమనించారు. వెంటనే ఆమెను తన వాహనంలో పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు. కార్వేటినగరం మండలం గాదంకి గ్రామానికి చెందిన జయమ్మ(70) వెదురుకుప్పానికి తమ బంధువుతో కలిసి శనివారం బైక్‌లో వచ్చింది. తిరుగు ప్రయాణంలో వెదురుకుప్పం మండలం అయ్యన్నగారిపల్లె సమీపానికి వచ్చేసరికి ఆమెకు బీపీ ఎక్కువై, స్ట్రోక్ వచ్చింది. ఆ బైక్ వెనుక వస్తున్న వెదురుకుప్పానికి చెందిన ఆర్‌ఎంపీ నక్కా మధు గుర్తించి ఆమెకు సీపీఆర్ చేశారు. ఆ సమయంలో విధి నిర్వహణలో భాగంగా పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పంకు వెళ్తున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య గమనించారు. అపస్మారకస్థితిలో ఉన్న వృద్ధురాలిని తన వాహనంలో ఎక్కించుకుని తిరిగి పచ్చికాపల్లం పీహెచ్‌సీకి తీసుకెళ్లి, చికిత్స అందించడానికి సహకరించారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఒకరి మృతి

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దపంజాణి మండలం ఆకులవారిపల్లెకి చెందిన ఆర్. ప్రభాకర్‌రెడ్డి తనపల్లి క్రాస్ సమీపంలోని హరివిల్లు డాబావద్ద రోడ్డు దాటుతుండగా చిత్తూరునుంచి విజయవాడ వైపు వెళుతున్న ప్రైవేటుట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్నకుమారుడు రాజేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు.

రేపు 'కడా' పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): 'కడా' పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. కుప్పం మండల సచివాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుంది. అర్జీదారులు వివిధ సమస్యలపై సమర్పించే అర్జీలను అప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తారు. నియోజకవర్గ ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడా కార్యాలయ అధికారులు తెలిపారు.

చల్లా బాబును కలిసిన న్యాయవాదులు



పుంగనూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని శనివారం ఆయన స్వగృహంలో పుంగనూరులో నూతనంగా ఎంపికైన న్యాయవాదుల సంఘనాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన న్యాయవాదుల సంఘ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన చెన్నకేశవులు మాట్లాడుతూ పుంగనూరు న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట న్యాయవాదుల సంఘ నాయకులు రఘునాథ్‌రెడ్డి, వెంకటముని, ప్రసాద్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, అరవింద, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని మారెమ్మకు పుష్పపల్లకీ సేవ



పుష్పపల్లకీలో ఊరేగుతున్న అగ్నిమారెమ్మ

గుడుపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుండ్లసాగరంలో కొలువైన అగ్ని మారెమ్మ దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అగ్ని మారెమ్మను పుష్పపల్లకీలో ఊరేగించారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

శ్రీరామనవమికి ముస్తాబైన ఆలయాలు

పలమనేరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా పలమనేరులోని శ్రీరామ భజన మందిరాలు, ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం మధ్యాహ్నం నుంచే ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 6న ఆదివారం ఉదయం నుంచే శ్రీరామ భజన మందిరాల్లోను, ఆంజనేయస్వామి ఆలయాల్లోను స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేక జరుగుతాయి. కొలమాసనపల్లిలో వెలసిన వైకుంఠ రామాలయంలో ఉత్సవమూర్తులకు ఉదయం 9 గంటల నుంచి సీతారామ కల్యాణోత్సవం, హోమం, పూర్ణాహుతి, సాయంత్రం హనుమంత వాహనసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అర్చకం శ్రీనివాసమూర్తి, అర్చకం పట్టాభిమూర్తి, అర్చకం సుందరరాజులుస్వామి తెలిపారు.

రోడ్డుపై తోపుడుబండ్లు నిలిపితే చర్యలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ తోపుడుబండ్లు, ఆటోలు, వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ లోకేశ్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహనాలు, ఆటోలు, తోపుడుబండ్లు పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన నాయకులు



రఘురామకృష్ణమరాజును కలిసిన టీడీపీ నాయకులు లక్ష్మణరాజు, సుదర్శన్‌రాజు

చౌడేపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామరాజును టీడీపీ నాయకులు, పారిశ్రామికవేత్త మాదిరాజు లక్ష్మణరాజు శనివారం బెంగళూరులోని విమానాశ్రయంలో కలిశారు. కార్యక్రమంలో చౌడేపల్లెకు చెందిన సుదర్శన్‌రాజు, పురుషోత్తమరాజు, శ్రీనివాస్‌రాజు, శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్‌ఐ శివశంకర్

సోమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సోమల పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇతర స్టేషన్లకు వెళ్లిన కానిస్టేబుళ్లను శనివారం ఎస్‌ఐ శివశంకర ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బుడ్డా నాయక్ (రాళ్లబుదుగూరు), వెంకట్ రెడ్డి (ఎన్‌ఆర్.పేట), మోహన్‌రెడ్డి (తవణంపల్లె), ఫైజుద్దీన్ (నగరి) స్టేషన్లకు బదిలీ కావడంతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో బాలాజీకి సన్మానం



బాలాజీని సన్మానిస్తున్న పలువురు సభ్యులు

పలమనేరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కెనడా తెలుగుతల్లి పురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం పొందిన రచయిత, పెద్దపంజాణి మండల ఎంపీడీవో పలమనేరు బాలాజీని శనివారం పలమనేరులోని సాయి మేధ పాఠశాలలో పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గిరిధరమూర్తి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో కొలువైన సోమేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 14 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు ఓ ప్రకటనలో తెలిపారు. 10న అభిషేకం, గంగపూజ, గణపతిపూజ, అంకురార్పణం, 11న రుద్రాభిషేకం, ధ్వజారోహణం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, గిరిజాకల్యాణం, వృషభ వాహనోత్సవం, 12న రథోత్సవం, 13న మొక్కుబడి ఉత్సవాలు, 14న అగ్నిగుండ ప్రవేశం, వసంతోత్సవం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

పల్లె అందం పరుగులు..!

- పకడ్బందీగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం నిర్వహణ
- చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యం
- సేంద్రియ ఎరువుల తయారీతో ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న చౌడేపల్లె పంచాయతీ
- ప్రశంసలందుకుంటున్న సచివాలయ అధికారులు

పంచాయతీలో పారిశుధ్యమే లక్ష్యం



చౌడేపల్లె పంచాయతీలో పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. చెత్త నుంచి సంపద తయారు చేయాలనే లక్ష్యంతో పారిశుధ్య కార్మికులతో కలిసి పనిచేస్తున్నాం. చెత్త నుంచి సంపద తయారు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణలకు గురికాకుండా కంచె వేశాం. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల సూచనలతో త్వరలో మరింత ఆదాయం పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఈకో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. దాతలు సహకారంతో సుందర ఉద్యానవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రం వద్ద స్థలంలో పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, శ్రీగంధం, వెదురు తదితర మొక్కలను పెంచేందుకు, బెంచీలు ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలి.

- మహేశ్వర్ , పంచాయతీ కార్యదర్శి

ఆదర్శవంతంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం



చౌడేపల్లె పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని జిల్లాలోనే ఆదర్శవంతంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. చెత్త నుంచి సంపద తయారీతోపాటు కొందరికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో సోలార్ ద్వారా విద్యుత్ వినియోగించి ఈకో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంగా ఏర్పాటు చేస్తాం. అలాగే మండలంలోని అన్ని ఎస్‌డబ్ల్యూ పీసీల నుంచి వచ్చే చెత్త నుంచి ఆదాయం చేకూరేలా కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్నాం.

- లీలామాధవి, ఎంపీడీవో, చౌడేపల్లె



చౌడేపల్లె పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం



ఆకు కూరలకు నీరు అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్

చౌడేపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చెత్త రహిత పంచాయతీయే లక్ష్యంగా పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేస్తూ పంచాయతీ అభివృద్ధికి సంపద సృష్టిస్తున్నారు అధికారులు. చౌడేపల్లె అందం పరుగులు తీస్తూ పలు పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది. 2019లో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు సీఎం చంద్రబాబునాయుడు చెత్త నుంచి సంపద సృష్టించాలని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం ఎస్‌డబ్ల్యూపీసీ లను నిరుపయోగంగా మార్చేసింది. నేడు మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చెత్త నుంచి సంపద సృష్టికి అడుగులు పడ్డాయి. సాధారణంగా గ్రామాల్లో నుంచి సేకరించిన చెత్తను చెరువుల, ఊరు బయట వేసి వదిలేసేవారు. ఇప్పుడు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. చౌడేపల్లె పంచాయతీ కార్యదర్శిగా మహేశ్వర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిరుపయోగంగా మారిన ఎస్‌డబ్ల్యూపీసీకి మరమ్మతులు చేయించి సుమారు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణలకు గురికాకుండా కంచె వేయించారు. సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని భావించిన ఆయన నిత్యం పారిశుధ్య పనులపై పర్యవేక్షిస్తూ పనులు చేయిస్తున్నారు. రోజూ సుమారు 3 ట్రాక్టర్ల చెత్తను ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రానికి తరలించి అక్కడ తడి, పొడి చెత్తలను వేరు చేయిస్తున్నారు. చెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను వెట్ క్లీనర్ మిషన్‌తో క్లీన్ చేయించి వాటిని మరో మిషన్‌తో ప్లాస్టిక్ వ్యర్థాలను ముక్కలు ముక్కలుగా చేసిన ప్లాస్టిక్ చిప్స్ కిలో రూ.50 ధరతో విక్రయిస్తున్నారు. నెలకు సుమారు 300 నుంచి 500 కిలోల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. వర్మీకంపోస్టు ఎరువుల తయారీకి 24 పిట్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో వానపాములు వదిలి సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. ఒక్కో పిట్ నుంచి 70 రోజుల్లో టన్ను సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. టన్ను సేంద్రియ ఎరువు రూ.7 వేలకు పైగా మార్కెట్ ధర పలుకుతోంది. ఈ విక్రయాలతో పంచాయతీకి ఆదాయం చేకూరుతుంది. అలాగే రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కావాల్సిన రైతులకు వానపాములను సైతం సరఫరా చేస్తున్నారు. ఎరువు తయారీకి సుమారు 70 రోజులు పడుతుందని, ఆ ఎరువు తయారీ అయ్యేలోపు కొత్తిమీర, మెంతిఆకు, తోటకూర, పాలకూరాకులు పెంచుతున్నారు. ఇక్కడి కేంద్రం జిల్లాలోని పలు పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఏడాదికి సుమారు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం చేకూరేలా పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ కృషి చేస్తున్నాడు.



గ్రామంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి



ప్లాస్టిక్ కవర్లను శుభ్రం చేసే వెట్‌క్లీనర్ యంత్రం



చెత్తకు నీరు పడుతున్న గ్రీన్ అంబాసిడర్

9న పలమనేరు మండల సమావేశం

పలమనేరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న పలమనేరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఖాదర్‌బాషా తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

యువత అధ్యక్షుడిగా సోమరాజు

పలమనేరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కులు అవినీతి నిర్మూలన సంస్థ అనుబంధ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా సోమరాజును ఎంపిక చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు డీపీ మునిరత్నం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమరాజు సమస్యల పరిష్కారంలో చురుగ్గా పాల్గొంటున్నందున యూత్ అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కేసుల నమోదు

చౌడేపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ ఆలయం నిర్మాణం చేపట్టిన వారిపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని గడ్డంవారిపల్లెలోని బీసీ కాలనీలో గ్రామదేవత గంగమ్మ ఆలయం ఉండేది. గత వైసీపీ ప్రభుత్వంలో గంగమ్మ ఆలయం ముందు అదే గ్రామానికి చెందిన గిరిబాబు ఆలయం నిర్మించి స్లాబ్ వేసి అమ్మవారి ప్రతిష్ఠ లేకుండానే గోడలకే పరిమితమైంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓబులేసు గంగమ్మ ఆలయం స్థలంలోనే నూతన ఆలయం నిర్మాణం పనులు గ్రామస్థుల అనుమతితో చేపట్టారు. ఈక్రమంలో ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. దాడుల్లో ఓబులేసు, ప్రసాద్, రాజు, వినోద్‌లకు తీవ్ర గాయాలు కావడంతో పుంగనూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారన్నారు. ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు బైరెడ్డిపల్లెలో కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 6న ఆదివారం ఉదయం 9 గంటలకు మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11న నాగిరెడ్డిపల్లెలో కబడ్డీ పోటీలు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో ఈనెల 11న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ. 5 వేలు, నాలుగో బహుమతిగా రూ. 3 వేలు, ఐదో బహుమతిగా రూ.1,500 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

పంటలను నమోదు చేసుకోవాలి

రొంపిచెర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): రొంపిచెర్ల మండలంలో వేసవి కాలం (మార్చి 15 తేదీ తర్వాత) సీజన్‌లో వేస్తున్న టమోటా, వంకాయ, దోసతోపాటు ఇతర కూరగాయ ల పంటలను రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని ఏవో సుధారాణి తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మాట్లాడుతూ వేసవి సీజన్‌లో వేసిన పంటల నమోదుతో ప్రకృతి వైపరీత్యాలు జరిగి పంట నష్టం జరిగితే పరిహారం, రాయితీ పనిముట్లు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని మాగాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.20,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని ఓ ప్రైవేటు మండపంలో శనివారం పెద్దపంజాణి మండలం కొళత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వి.కె.నగేష్ పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తుందన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన నగేష్‌ను ఆయన సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నూతన విద్యావిధానంతో ఎదురవుతున్న సమస్యలపై పలువురు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గురురాజారావు, తులసినాథంనాయుడు, సోమచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు సోమశేఖర్‌గౌడు, కుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, మదన్, శ్రీధర్ పాల్గొన్నారు.

దళితజన బాంధవుడు.. బాబూ జగ్జీవన్‌రామ్



కుప్పం మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్‌కు నివాళులు




ఇంజనీరింగ్ కళాశాలలో

కుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ దళితజన బాంధవుడని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. కుప్పం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు ఎంఆర్.సురేశ్, సోము, సెల్వరాజ్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ నరేశ్ పాల్గొన్నారు.


- కేఈసీలో: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటం, సత్యాగ్రహం, శాసనోల్లంఘనం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన జాతిపిత గాంధీజీ అభిప్రాయాలతో ఎక్కువగా ఏకీభవించేవారన్నారు. కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవన్, కో ఆర్డినేటర్ గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.
- సోమల: స్వర్గీయ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సోమల జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగరత్న, శివయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
- పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ శారదాదేవి, పరిపాలనాధికారి భాస్కర్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.
- పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం దివంగత దేశ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ మేనేజర్ ఎస్.ఎం.ఖాదర్‌మొహిద్దీన్, టీడీపీ నాయకులు నాగరాజు, సుబ్రహ్మణ్యం గౌడు, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో స్వాతంత్ర్య సమరయోధులు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు విశ్రాంత డీఎస్పీ సుకుమార్, వైవీ.రమణ, నరసింహులు, శ్రీనివాసులు, మహానంది, నాగేనాయక్, అద్దాల నాగరాజు, చంద్ర, న్యాయవాది శ్రీనివాసులు, రెడ్డెప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


- రాయలసీమ చిల్డ్రన్స్ ఆకాడమి పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రి, ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు.
- రొంపిచెర్ల: రొంపిచెర్లలో శనివారం జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, బీసీ సంఘం నాయకుడు నారాయణస్వామి, ఈవోపీఆర్‌డీ సత్యంరెడ్డి, నాయకులు సుభాష్, హరిప్రసాద్, చిన్ననాగరాజ, రామాంజనేయులు, కృష్ణయ్య, నరేష్, చంద్రయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో...



పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో..



రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో..

బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ



బాలింతలకు బేబీ కిట్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వారిచే ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు బేబి కిట్లను అధ్యక్షులు ధీరజ్, ఆర్పీ గోపీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రతినెల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం లయన్స్ క్లబ్ సభ్యులు రోగులకు పాలు, పండ్లు అందించారు. అనంతరం పిల్లలకు ఉపయోగపడే కిట్లను బహుకరించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్, తుకారాం, కృష్ణమూర్తి, రమేష్, కుమార్‌రాచారి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచుకోండి

విద్యార్థులకు కలెక్టర్ సూచన



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, చంద్రబోస్, తేజోమూర్తి, శైలజామూర్తి, ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ నైపుణ్యాలను పెంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో విజయం డిగ్రీ కళాశాల 22వ వార్షికోత్సవం విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత చంద్రబోస్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు పాటలతోనే సమాధానం ఇచ్చారు. అనంతపురం శ్రీవివేకానంద ఎడ్యుకేషన్ విద్యాసంస్థల చైర్మన్ రవీంద్రచౌదరి, తేజోమూర్తి, శైలజామూర్తి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రసంగించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకులు పాల్గొన్నారు.

'జేఈఈ'పై సదస్సు



సదస్సుకు హాజరైన నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తదితరులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థులు ఐఐటీలో సీటు సాధించడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తెలిపారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌పై సదస్సు నిర్వహించారు. డీజీఎంతోపాటు కోర్డీన్ శ్రీనివాసరావు, సీనియర్ కెమిస్ట్రీ అధ్యాపకుడు చిట్టిబాబు పాల్గొన్నారు. డీజీఎం మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యతును నారాయణ విద్యాసంస్థలతో సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ఏసీఎం శివకుమార్, స్కూల్ ఏజీఎం పనికుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండ రామాలయంలో శనివారం ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ నంబూరి రమేష్, కె.ఆర్ నారాయణమూర్తి ఉభయంతో ధ్వజారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం మురళి ఏజెన్సీస్, సదుం జ్యువెలరీస్ ఉభయంతో స్వామివారికి సింహవాహన సేవ జరిగింది. శ్రీకలెక్షన్స్ బద్రీనాథ్, లయన్ మనోహర్, ఆలయ సిబ్బంది రెడ్డెప్ప, శీను, చెంగల్‌రాయలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరదరాజులస్వామి ఆలయానికి కానుకగా వెండి పళ్లెం



యాదమరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామి ఆలయానికి వెండి పళ్లెం ఒకటి శనివారం కానుకగా అందింది. మోర్దానపల్లి పంచాయతీ సీఆర్ కండ్రిగకు చెందిన కృష్ణారెడ్డి, ఎల్లమ్మల జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న వారి కుమారుడు, ప్రవాస భారతీయుడు హరిబాబురెడ్డి.. రూ.80,000 విలువచేసే వెండి పళ్లెం అందజేశారు.

కల్పవృక్ష వాహనంపై ఊరేగిన సీతారాములు



వెదురుకుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సీతారామ లక్ష్మణులు శనివారం కల్పవృక్ష వాహనంపై కార్వేటినగరం పుర వీధుల్లో ఊరేగారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో స్వామివార్లను మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు వేదపండితులు స్నపన తిరుమంజన చేశాక తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. ఆలయ ఆవరణంలో ఊంజల్‌సేవ నిర్వహించాక కల్పవృక్ష వాహనంపై ఊరేగించారు. ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, వేదపండితులు రమేష్‌శబరి, గోపాలాచారి, భక్తులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు పెంచాలి: ఏఐటీయూసీ



నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. శనివారం పుల్లూరు క్రాస్ రోడ్డులో గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేంద్రన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అనాదొరై, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్ణ, ఉపాధ్యక్షుడు ఇసాక్ మనీ, సహాయ కార్యదర్శులు దేశప్ప, అర్పుదం, నాయకులు మునివేలు, అర్జున్, రాజా పాల్గొన్నారు.

గాయపడ్డ టీడీపీ కార్యకర్త మృతి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తంబుగానిపల్లె పంచాయతీ కొత్తవెంకటాపురానికి చెందిన శివయ్య (43) గతనెల 21వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చురుకైన కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ పేర్కొన్నారు. పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. సంతాపం తెలిపిన వారిలో.. క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధరణి, జనార్దనగౌడ్, మోహన్‌నాయుడు, తిరుమల నాయుడు, తదితరులు ఉన్నారు.

అధికార నంది వాహనంపై కరకంఠేశ్వరుడి విహారం

నగరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరుడి ఆలయంలో జరుగుతున్న పంగుణి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. స్వామి వారికి ఉదయం అభిషేకం, అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



కోసలనగరంలో తాగునీటి కోసం తిప్పలు


పొలం నుంచి నీటిని తెచ్చుకుంటున్న వృద్ధుడు

విజయపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కోసలనగరంలో రెండు వారాలుగా రెండు వీధుల్లో తాగునీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్లపై ఆధార పడుతున్నామని చెప్పారు. ఎండలు మండిపోతుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



చర్చివీధిలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

నగరంలో 'శ్రీరామ నవమి' సందడి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పండుగ సందర్భంగా పూజా సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన జనంతో శనివారం చర్చివీధిలో సందడి నెలకొంది. రోడ్లన్నీ కిక్కిరిశాయి. ఇక నగరంలోని కోదండరామ, పొన్నియమ్మ గుడి వీరాంజనేయ, గిరింపేట వీరాంజనేయ, కట్టమంచి వరదరాజ ఆలయాలు, గొడుగుమూరు, కొంగారెడ్డిపల్లె, సంతపేట, తేనెబండ ప్రాంతాల్లోని శ్రీరామ భజన మందిరాలను నిర్వాహకులు విద్యుద్దీపాలతో అలంకరించారు.


కోదండ రామాలయం వద్ద విద్యుద్దీపాలంకరణ

వేడుకగా భూత వాహనసేవ


అగస్త్రీశ్వరుడి భూత వాహన సేవలో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అగస్త్రీశ్వరాలయంలో జరుగుతున్న పంగుణి ఉత్సవాల్లో భాగంగా శనివారం భూత వాహన సేవ వేడుకగా జరిగింది. గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి ఆలయ ట్రస్ట్, వి.అశోక్ కుమార్, విద్యాసాగర్, రాజశేఖర్ ఉభయంతో ఆలయ అర్చకుడు శివకుమార్ శివాచార్యులు ఈ సేవను నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు గిరింపేట రాధాకృష్ణాశెట్టి, బద్రీనాథ్ ఉభయంతో 101 కొబ్బరికాయల నీటితో అభిషేకం చేశారు. బాలాజీ, రఘుపతి శెట్టి, రమేష్‌బాబు ఉభయంతో శేషవాహన సేవను ఆలయ ఈవో వెంకటరాయలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాళభైరవ ట్రస్టు వెంకటేషన్, లత జ్యువెలరీస్ మల్లికార్జున్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి అలంకరణలో మహావిష్ణువు: గిరింపేట సీబీ రోడ్డు వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.శనివారం వేంకటేశ్వరస్వామి అలంకారంలో మహావిష్ణువు భక్తులకు దర్శనమిచ్చారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం: డీఎస్పీ


కార్వేటినగరంలో కుబేంద్రన్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందిస్తున్న డీఎస్పీ అజీజ్

వెదురుకుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని నగరి డీఎస్పీ అజీజ్ తెలిపారు. కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండిన కుబేంద్రన్ అనారోగ్యంతో ఈనెల ఒకటో తేదీన చనిపోయాడు. ఆయన కుటుంబీకులను శనివారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పి.రాజ్‌కుమార్‌తో కలసి డీఎస్పీ పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని కడపగుంట దళితవాడకు చెందిన కానిస్టేబుల్ ఆనందబాబు ఎస్ఆర్‌పురంలో పనిచేస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. వీరి కుటుంబాన్ని కూడా శనివారం డీఎస్పీ పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. సీఐతోపాటు ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు.

విజయరామరాజుకు నివాళి



విజయరామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్టీయూ నేతలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ ఉద్యమ పితామహుడు, మాజీ ఎమ్మెల్సీ విజయరామరాజు వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు నివాళి అర్పించారు. ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, దేవరాజులరెడ్డి, మురళి, ప్రకాష్, చంద్రన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు.

సోము వీర్రాజుకు సత్కారం



వెదురుకుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజును ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్, వెదురుకుప్పం మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి శనివారం చిత్తూరులో కలిశారు. శాలువ కప్పి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డేపల్లెలోని సీతారామలక్ష్మణ ఆలయంలో గణపతి హోమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారామలక్ష్మణ, హనుమ, గరుడ వాహనాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలను అర్చకులు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

పెనుమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తన భార్య రాణి కనిపించడం లేదని చిప్పర్లపల్లె గ్రామపంచాయతీ పాళెం యానాది కాలనీకి చెందిన రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమకు ఏడేళ్ల కిందట వివాహమైందని, నాలుగేళ్ల పిల్లాడు ఉన్నాడని తెలిపాడు. మార్చి 30వ తేదీనుంచి తన భార్య కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామచంద్రయ్య తెలిపారు.



నల్ల బెల్లం సరఫరా చేసిన వ్యక్తి అరెస్టు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలం చిత్తపారలో శనివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సారా తయారీదారులకు నల్లబెల్లం సరఫరా చేసిన చంద్రన్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడ్డ రమేష్

వెదురుకుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దామరకుప్పం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చవటగుంట కాలనీకి చెందిన రమేష్(35) గాయపడినట్లు స్థానికులు తెలిపారు. రెండు ఆటోలు ఢీకొన్న నేపథ్యంలో ఓ ఆటో డ్రైవింగ్ చేస్తున్న రమేష్ గాయపడ్డారని, ప్రథమ చికిత్స నిమిత్తం పచ్చికాపల్లం పీహెచ్‌సీకి తరలించినట్లు చెప్పారు.

ఘర్షణపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తండ్రీకొడుకుల మధ్య జరిగిన ఘర్షణపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. న్యూ బాలాజీ కాలనీలో నాగరాజు అతడి భార్య, కుమారుడు కిరణ్, కోడలు ఉంటున్నారు. శనివారం తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ తలెత్తింది. తండ్రిపై కుమారుడు దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజోతి): వివాహిత అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. ఇరువారంలో బాబు, ఏంజల్ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. గత నెల 29వ తేదీన తాను పనికి వెళ్లాక ఏంజల్ ఇంటి నుంచి వెళ్లిపోయిందని బాబు తెలిపాడు. అప్పటినుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా కనిపించక పోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ లేకుంటే చర్యలు తప్పవు


హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా రోడ్డెక్కితే చర్యలు తప్పవని ద్విచక్ర వాహనదారులను బీఎన్ఆర్ పేట ఎస్ఐ వెంకటనారాయణ హెచ్చరించారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని శెట్టింతంగాల్ వద్ద హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అలాగే మద్యం మత్తులో వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

జగ్జీవన్‌రామ్ బాటలో నడుద్దాం

- ఎమ్మెల్యే మురళీమోహన్


జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్ తదితరులు

చిత్తూరు(గాంధీ సర్కిల్), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్‌రామ్ బాటలో నడుద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ పిలుపునిచ్చారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని గంగినేని చెరువు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని దళిత హక్కుల పోరాట సమితి, సీపీఐ నాయకులు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. నాయకులు నాగరాజు, మణి, ఆర్ముగం, జయ్‌కుమార్, సుందరం, కుమారి పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీవరత్నం, దళిత నాయకులు మాసలామణి, నాగరాజు, జయపాల్, మురుగేష్, షణ్ముగం, రాజేంద్ర, ఉమాపతి, రమణ, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు సెంట్రల్: సమగ్రశిక్ష కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీసీ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. ● బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నేతలు రవికుమార్, బ్రహ్మానందం, బాబు, నీరజాక్షులు, షణ్ముగం, తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేశారు.




జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన దళిత హక్కుల పోరాట సమితి, సీపీఐ నాయకులు - చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ, సిబ్బంది - పూతలపట్టులో నివాళి అర్పించిన దళిత నేతలు

సంక్షిప్తంగా..

వన వేణుగోపాలుడికి పూజలు



వెదురుకుప్పం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

నగరి ఏఎంసీ డైరెక్టర్లు వీరే..


నాగభూషణం రాజు - జగన్ - రవిరాజు

నిండ్ర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్లుగా నిండ్ర మండలానికి చెందిన ఐదుగురిని నియమించారు. వీరిలో.. నాగభూషణం రాజు(మేళంబాకం), జగన్ (నెట్టేరి), రవి రాజు (ఎంఎస్‌వీఎంపురం), దీప(పాదిరి), హేమావతి(మిట్టకండ్రిగ) ఉన్నారు. తమకు పదవులు రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, నిండ్ర మండలం నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



బంగారుపాళ్యం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లె పంచాయతీ మడుపోలూరులో టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకున్న 600 మందికి కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. మండల క్లస్టర్ ఇన్‌చార్జీ ఎన్పీ ధరణి మాట్లాడుతూ.. సభ్యత్వం తీసుకున్న కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు హేమచంద్రనాయుడు, గురుజాల సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను నివారిద్దాం


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

నగరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను నివారిద్దామని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పిలుపునిచ్చారు. డీఎస్పీ కార్యాలయ ఆవరణలో శనివారం అగ్నిప్రమాదాలను నివారించడంపై స్థానిక ప్రజలకు ఫైర్‌స్టేషన్ సిబ్బందితో అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


మహారాజపురం వద్ద గుంత తవ్వి రోడ్డుపై పోసిన మట్టి

విజయపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పన్నూరు సబ్‌స్టేషన్ - కనకమ్మసత్రం రోడ్డు పక్కన కేబుల్ పనుల పేరుతో గుంతలు తవ్వేశారు. ఇలా తవ్వేసిన గుంతల నుంచి తీసిన మట్టిని రోడ్డుపై వదేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.